
ప్రజాశక్తి

గురువారం 18 డిసెంబర్ 2025

5



ఇక వాట్సాప్‌లో బస్ టికెట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుండే ఎపిఎస్‌ఆర్‌టిసి ఇప్పుడు సామాన్యుడికి మరింత చేరువయ్యేందుకు సరికొత్త అడుగు వేసింది. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు కేవలం మొబైల్ ఫోన్ ద్వారా, మన మిత్ర డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా వాట్సాప్ ద్వారా సులభంగా టికెట్లను బుక్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రజా రవాణా అధికారి జి వరలక్ష్మి తెలిపారు. దీనికోసం ప్రయాణీకులు 9552300009 అనే నెంబర్‌ను తమ ఫోన్‌లో సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో 'హాయ్' అని సందేశం పంపిస్తే చాలు. వివిధ రకాల సేవలు కనిపిస్తాయి వెంటనే ఆర్టీసీకి సంబంధించిన సేవల జాబితా ఎంచుకుని మీకు కావలసిన రూట్లో టికెట్ను బుక్ చేసుకుని సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఒక్క అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు.

పార్లమెంట్ కమిటీ కూర్పులో

సామాజిక సమతుల్యత

- అధ్యక్షులు ఎస్‌టి.. ప్రధానకార్యదర్శి బిసి
- స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకున్న టిడిపి

ప్రజాశక్తి-పార్వతీపురం

రెండు గిరిజన జిల్లాలకు సంబంధించిన అరకు పార్లమెంట్ కమిటీ కూర్పులో టిడిపి అధిష్టానం సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. పార్టీ అధ్యక్ష పదవిని ఎస్‌టిలకు, ప్రధాన కార్యదర్శిగా బిసిలకు కేటాయించడంతో పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇద్దరూ మన్యం జిల్లాకు చెందిన వారే కావడం ద్వారా పార్లమెంట్ కమిటీలో అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లయిందనే చర్చ సాగుతోంది. కమిటీకి సంబంధించిన కీలక పదవుల్లో ఒకటైన ప్రధాన కార్యదర్శి పదవిని సీనియర్ నాయకుడు దత్తి లక్ష్మణరావుకు ఇవ్వడం ద్వారా జిల్లాలో బలమైన బిసిలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు అయింది. రాజకీయాల్లో జూనియర్ అయినప్పటికీ ఎం.తేజోవతిని అధ్యక్షులుగా నియమించడం వెనుక పార్లమెంట్ పరిధిలో కీలకమైన గిరిజనులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తేలింది. అంతే కాకుండా ఆమె ఉన్నత విద్యావంతురాలు కావడం కూడా కీలక బాధ్యత అప్పగించడానికి కారణమైంది.

అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాలో వైసిపికి గట్టి పట్టుంది. మన్యం జిల్లాలో నలుగురు టిడిపి కూటమి ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ పార్టీ ప్రయోజనాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన సామాజిక తరగతులకు చెందిన నాయకులను కీలక పదవుల్లో కూర్చోబెట్టాలని రాష్ట్ర నాయకత్వం భావించినట్లు తెలుస్తోంది. టిడిపికి బలమైన కేడర్ ఉన్నప్పటికీ ప్రతిపక్ష పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రుల వ్యాఖ్యలపై తగిన కౌంటర్ ఇవ్వడంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు వెనుకబడుతున్నారు. ఇటీవల జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురికావడం వంటి పరిణామాలపై వైసిపి నాయకుల వ్యాఖ్యలకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు తగిన రీతిలో జవాబులివ్వలేక పోయారు. ఒక దశలో అధికార పార్టీ ఆత్మరక్షణలో పడిన పరిస్థితి ఏర్పడింది. వీటన్నిటితో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. జిల్లాలో మెజారిటీ స్థానిక సంస్థలు వైసిపి గుప్పెట్లో ఉన్నాయి. సమీప భవిష్యత్తులో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా టిడిపి అధిష్టానం అడుగులు వేస్తోంది. దీనికోసం పార్లమెంట్ కమిటీ కూర్పులో అధిష్టానం సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చిందనే ప్రచారం సాగుతోంది.

తేజోవతికి అభినందనల వెల్లువ

టిడిపి అరకు పార్లమెంట్ కమిటీ అధ్యక్షులుగా ఎం.తేజోవతిని నియమించడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాలకు చెందిన నాయకులు ఆమెకు ఫోన్ల ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కొంతమంది నాయకులు విజయవాడ వెళ్లి తేజోవతిని నేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి సన్నిహితులైన కొంతమంది నాయకులు కూడా విజయవాడ వెళ్లి తేజోవతిని కలిసి శుభాకాంక్షలు చెప్పినట్లు తెలుస్తోంది.

తేజోవతి నియామకంపై హర్షం

కురుపాం : టిడిపి అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులుగా మోజోరు తేజోవతి నియామకంపై ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.



తేజోవతికి శుభాకాంక్షలు తెలుపుతున్న లావణ్య

రాష్ట్ర వ్యాప్తంగా

జీడిపండ్లు పంపేందుకు అనుమతివ్వాలి

- పిల్లలకు సీజనల్ పండ్లు ఇచ్చేందుకు అవకాశం కల్పించాలి
- కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి
- పోలమాంబ జాతరకు రావాలని సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి-పార్వతీపురం

అధిక పోషక విలువలు కలిగిన జీడి పండ్లను రాష్ట్ర వ్యాప్తంగా పంపేందుకు అనుమతిని మంజూరుచేయాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరారు. బుధవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో 70వేల ఎకరాల్లో జీడి సాగు ఉందన్నారు. జీడిపప్పును మాత్రమే తీసుకొని, అధిక పోషక విలువలు కలిగిన పండు తీసుకోవడం లేదని సిఎం దృష్టికి తీసుకువచ్చారు. ఐరన్, మెగ్నీషియం, జింక్ వంటి పోషక విలువలు కలిగిన జీడి పండు తీసుకోవడం ద్వారా చక్కెర వ్యాధిని నియంత్రించడమే కాకుండా పోషక విలువలు పెరుగుతాయని వివరించారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జీడిని పంపేందుకు అనుమతిని మంజూరు చేయాలని కోరారు. వీటితో పాటు జిల్లాలో 3 వేల ఎకరాల్లో పైనాపిల్ పంట సాగులో ఉందన్నారు. అందుకే 'ఈట్ సీజనల్ ఫ్రూట్.. ఈట్ లోకల్ ఫ్రూట్' భావనతో ముందుకు వెళ్లాలనేది తమ ఉద్దేశమన్నారు. స్థానికంగా లభ్యమయ్యే సీజనల్ పండ్లను పిల్లలకు ఇచ్చేలా ఆలోచన చేస్తున్నామని, ఇందుకు కూడా అనుమతిని మంజూరు చేయాలని కలెక్టర్ సిఎంను కోరారు. పోషక విలువలను పరీక్షించి, దానిపై తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు.



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

సమ్మక్క - సారక్క జాతర మాదిరిగా మన్యం జిల్లాలో పోలమాంబ జాతర అంత ప్రాముఖ్యత చెందిందని, దీన్ని రాష్ట్ర పండుగ కింద ప్రభుత్వం గుర్తించిందని కలెక్టర్ తెలిపారు. అటువంటి జాతరకు తొలిసారిగా ముఖ్యమంత్రి వస్తే మన్యం జిల్లాకు మరింత గుర్తింపు వస్తుందని కలెక్టర్.. సిఎంకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో గిరిజన పర్యాటకానికి ఇప్పుడిప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని, అయితే ఈ పండగ నిర్వహణకు నిధులు విడుదల కావడం లేదని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేస్తామని, ఇందుకు అవసరమైన మార్గదర్శకాలు విడుదల చేసి జాతరలు, పండుగలు సంస్కృతిని ప్రతిబింబింప చేయిస్తామని హామీ ఇచ్చారు.

'ఉపాధి హామీ' రద్దు బిల్లును వ్యతిరేకించండి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

ప్రజాశక్తి-సీతానగరం

ఉపాధి హామీ చట్టం రద్దు బిల్లును వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విబి - జి రామ్ జి' బిల్లును పార్లమెంటులో నిరసనల మధ్య లోక్‌సభలో ప్రవేశపెట్టారని, ప్రతిపక్ష సభ్యులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఈ బిల్లు ద్వారా వ్యవసాయ కూలీలు, ప్రజాసంఘాలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టం పోయి ఇది పథకంగా తయారవుతుందని చెప్పారు. గ్రామీణ పేదలకు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల కుటుంబాలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ఈ చట్టం పేరు మార్చే సాకుతో పేదలు, దీనిలో పనిచేస్తున్న ఉద్యోగుల ఉపాధి ఉసురు తీసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఇలాంటి చర్యలను అన్ని ప్రజాసంఘాలు, ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు అప్పలనాయుడు, ఆర్.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అత్యుత్తమ నేత్ర వైద్య సేవలు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యుత్తమ నేత్ర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆర్ఎంఒ శ్యామల తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న నేత్ర వైద్య శిబిరాల్లో ఎంపిక చేసిన వారికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆప్తాలమిస్టు వెంకటేష్, కృష్ణారావు నేత్ర శస్త్ర చికిత్సలు నిర్వహించారు. వీరికి చికిత్స అనంతరం ఉచిత వసతి, భోజనం, కళ్లద్దాలు, మందులు అందజేసినట్లు ఆర్ఎంఒ తెలిపారు. ఇళ్లకు వెళ్లాక కంటి రోగుల పట్ల అత్యంత శ్రద్ధ వహించాలని నేత్ర వైద్య అధికారి జీరు నగేష్‌రెడ్డి సూచించారు.



లెప్రసీ అనుమానిత కేసులను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

రాష్ట్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలో బుధవారం లెప్రసీ శాంపిల్ సర్వే అసెస్మెంట్ రాష్ట్ర బృందం పర్యటించింది. బలిజిపేట, చిలకలపల్లి, నారాయణపురం, పెద్దింపేట, పెదపెంకి, నూకలవాడ, అంపావల్లి, వంతరాం, వెంగళరాయపురం, గౌరిపురం గ్రామాల్లో గత నెల 17 నుంచి 30వ తేది వరకు పిహెచ్‌సి సిబ్బంది నిర్వహించిన లెప్రసీ సర్వే నాణ్యతను, అనుమానిత కేసులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పర్యటనలో రాష్ట్ర బృందం సభ్యులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ జయరామకృష్ణ, డిపిఎం రామకృష్ణ, సంజీవరావు, పిహెచ్‌సి వైద్యులు క్రాంతి కిరణ్మయి, మాధురి, జిఎంఎల్‌ఎఫ్ కోఆర్డినేటర్ శివరామకృష్ణ, డిపిఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసర్వే

- వెబ్‌ల్యాండ్‌లో పేరే కీలకం
- ప్రభుత్వ భూములు జిరాయితీగా మార్చకూడదు
- గ్రామ సర్వేయర్లు, విఆర్‌ఒ, విఆర్‌ఎల సమావేశంలో జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో భూముల రీసర్వే పనులు పకడ్బందీగా, సమగ్రంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో రెండో విడత రీసర్వే కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు, విఆర్‌ఒలు, విఆర్‌ఎలతో జెసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని జిరాయితీ భూమిగా మార్చే అవకాశం లేదన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఎవరి పేరు మీద భూమి ఉంటుందో పట్టాలో కూడా అదే పేరు ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. పాత రికార్డులు, కొత్త డిజిటల్ మ్యాపింగ్ వివరాలు సరితూగేలా చూసి, ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, రీసర్వే ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెంపొందించాలన్నారు.

తహశీల్దార్లు, సర్వేయర్లు, గ్రామ సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రతి మండలంలో రోజువారీ పురోగతిని పరిశీలించి నివేదికలు పంపించాలని ఆదేశించారు. 22ఎలో పేరు ఉన్న వారికి ఎటువంటి పట్టాదారు హక్కూ రాదని, డి-పట్టా భూమిని వెరిఫికేషన్ చేయాలంటే రెండే విధానాలు ఉన్నాయని తెలిపారు. భూమి ఉన్న వారి వద్ద ఒరిజినల్ డి-పట్టా ఉండాలని, అసైన్‌మెంట్ రిజిస్టర్లో వారి పేరు ఉంటేనే వారు భూమి హక్కుదారులు అవుతారని వివరించారు. వెబ్ ల్యాండ్‌లో ఉన్న పేర్లు తీసేసి అసైన్‌మెంట్ రిజిస్టర్లో ఉన్న పేర్లు పెట్టడం కుదరదని స్పష్టంచేశారు. రీసర్వే సమయంలోనే వారికి పిఒటి నోటీసు ఇచ్చి దానికి సంబంధించిన డి పట్టా ఉందా, లేదా అని నిర్ధారణ చేసుకున్న తరువాతే వెబ్‌ల్యాండ్‌లో పేరు తొలగించాలని సూచించారు. ఒరిజినల్ పట్టాదారు కానప్పుడు వారికి పిఒటి యాక్ట్ ప్రకారం నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రభుత్వం భూమి ఎస్‌ఎఫ్‌ఐలో ఉంటే జిరాయితీలోకి మారే అవకాశం లేదన్నారు. క్లాసిఫికేషన్ మారుస్తూ రెవెన్యూ కోర్టు ఆర్డర్ ఇస్తే తప్ప అసైన్మెంట్ చేసినా, ఎలినేషన్ చేసినా, ప్రభుత్వం భూమి జిరాయితీకి మారదన్నారు. ఒక వేళ అసైన్మెంట్ చేసినా, డి పట్టాగానే ఉంటుందని, జిరాయితీగా మారదని వివరించారు. అనాధీనం భూమిని 22ఎలో పెట్టాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి పి.లక్షణరావు, పార్వతీపురం డిఐఎస్ చిరంజీవి, రీ సర్వే తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, విఆర్‌ఒలు, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్



ధర్నా చేస్తున్న సిఐటియు, వ్యకాస నాయకులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు

సమస్యలు పరిష్కరించాలని

ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

ప్రజాశక్తి-మక్కువ

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఎపి ఫీల్డ్‌అసిస్టెంట్ల యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యాన స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.గంగునాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం.. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలను వలసలు పోకుండా ఆపగలిగిందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ పనుల అనంతరం ఉపాధి హామీ ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందాయని తెలిపారు. అంతటి ప్రాధాన్యత గల ఉపాధి హామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఇతర ఉద్యోగులు కొనసాగుతున్నారని, వారిపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర పని ఒత్తిడి పెంచిందని తెలిపారు. టార్గెట్లు లేకుండా ప్రభుత్వం పని చేయించాలని కోరారు. ఉపాధి హామీకి నిధులు పెంచి కూలీలకు మరిన్ని సౌకర్యాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. టెంట్లు, మజ్జిగ, ఇతర అవసరాల కోసం వెచ్చించే నిధులు భారీగా తగ్గించడం దారుణమన్నారు. దీంతో కూలీలకు అందాల్సిన సౌకర్యాలు పూర్తిగా దూరమయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణించి ఫీల్డ్‌అసిస్టెంట్లకు హక్కులు కల్పించాలని, కనీస వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో చనిపోతున్న వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి నష్టపరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై విశాఖలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సాంబమూర్తి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు, మండల కార్యదర్శి జి.కృష్ణారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు కమిటీ నాయకులు ఎం.వెంకటరమణ, కోన పాపారావు, రౌతు కన్నమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అంటిపేటలో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ వైశాలి

స్వచ్ఛ గ్రామంగా రూపుదిద్దుకోవాలి

సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి

ప్రజాశక్తి-సీతానగరం

అంటిపేట స్వచ్ఛ గ్రామంగా రూపుదిద్దుకోవాలని సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిపాదిత స్వచ్ఛ గ్రామమైన అంటిపేటను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఎక్కడా చెత్త కనిపించరాదని, పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించాలని, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఆమె గ్రామస్తులను కోరారు. గ్రామంలో తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి శశికుమార్‌ను ఆదేశించారు. ఇంటింటా మొక్కలు నాటి, గ్రామాన్ని హరితవనంగా మార్చాలని కోరారు. అనంతరం, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోబోమని అన్నారు. ఈ పర్యటనలో తహశీల్దార్ కె.ప్రసన్నకుమార్, ఎంపిడిఒ ఎంఎల్‌ఎన్ ప్రసాద్, సర్పంచ్ బి.తిరుపతిరావు, మాజీ సర్పంచ్ పి.నాగభూషణ్ రావు, పిఎసిఎస్ అధ్యక్షులు ఏగిరెడ్డి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్లగెడ్డ భూఆక్రమణపై సర్వే

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- మెంటాడ

గుర్ల గెడ్డ మినీ రిజర్వాయర్ పరిధిలో కాలువ భూములను ఓ భూస్వామి ఎటోరో రియల్ ఎస్టేట్ సంస్థ పేరిట అక్రమంగా వాహనాలతో నొల్లించి ప్లాట్స్ వేసిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో 'ప్రజాశక్తి'లో కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రాజెక్టు భూ విస్తరణను సర్వే చేసి పరిశీలించాలని చెప్పడంతో బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండల సర్వేయర్ తేజేశ్వరరావు, రొంపిల్లి విఆర్‌ఒ నాగేశ్వరరావు సర్వే నిర్వహించారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులు అనంతగిరి మండలంలో లేవని బొబ్బిలి ఆర్డిఒ ఆఫీసులో ఉంటాయని వారు చెప్పారు. రికార్డులు పరిశీలిస్తే తప్పా నిజానిజాలు తెలియని పరిస్థితి అని చెప్పారు. ప్రాజెక్ట్ ఎడమ కాలువ కప్పివేసిన అప్పన్న రాజును యథావిధిగా ప్రాజెక్టు డిజైన్ ప్రకారం అప్పగించాలని ప్రాజెక్టు పోరాట సమితి సభ్యులు అడిగారు. దీనికే ఆ బడా భూస్వామి అప్పన్నరాజు పది రోజులు గడువు కావాలని అడగడంతో సభ్యులు ఒప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో గుర్లగెడ్డ ప్రాజెక్టు పోరాట సమితి కార్యదర్శి రాకోటి రాములు, ఆయకట్టు రైతులు రెడ్డి రాజు, అప్పలనాయుడు, పుర్కాన అప్పలనాయుడు, గొర్లె సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



పాత కాలువ కప్పేసి కొత్తగా కాలువ తవ్వడాన్ని పరిశీలిస్తున్న సర్వేయర్లు

గుమ్మలక్ష్మీపురంలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, వీలైనంత త్వరగా పరిష్కారం చూపిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతు అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ గుమ్మలక్ష్మీపురం సబ్‌డివిజన్ పరిధిలోని రైతులకు రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చి దిగుబడులు పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె తెలిపారు. రబీసాగు సకాలంలో ప్రారంభిం చేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, మాజీ ఎంపిపి తాడంగి లక్ష్మణరావు, డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండల వ్యవసాయ అధికారులు శంకర్రావు నాగేశ్వరరావు, నాయకులు రాజేష్, బలరాం, మురళి, నాగేశ్వరావు, బాలు, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులతో ఎస్ఒ అరుణకుమారి

క్రీడల్లో కెజిబివి విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి-కొమరాడ

ఎస్‌జిఎఫ్ పోటీల్లో కొమరాడ కెజిబివి విద్యార్థినులు సత్తాచాటారు. అండర్-19 విభాగంలో ఆర్చరీలో పువ్వల శ్రేయ, బాల్‌బ్యాడ్మింటన్‌లో పువ్వల శ్రేయ, హిమరిక మధుప్రియ, అండర్-14లో హిమరిక కీర్తి, హ్యాండ్‌బాల్‌లో కె.గౌరి ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కెజిబివి ఎస్ఒ జి.అరుణకుమారి, పీడీ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

గ్రీన్ అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్‌చేశారు. ఈ మేరకు వీరఘట్టంలో బుధవారం గ్రీన్ అంబాసిడర్లు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త పేరుకు పోకుండా పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్లకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని అన్నారు. మూడు నెలలకు, ఆరు నెలలకు జీతాల బకాయిలు వేస్తున్నారని తెలిపారు. వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సిహెచ్ భాగ్యలక్ష్మి, గ్రీన్ అంబాసిడర్ లక్ష్మణ, రవి, కె.అప్పడు, తదితరులు పాల్గొన్నారు.


పిఒకి వినతి అందిస్తున్న గిరిజన చైతన్య వేదిక నాయకులు

పిఒకి గిరిజన చైతన్య వేదిక వినతి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి స్వప్నిల్ జగన్నాథ్‌ని గిరిజన చైతన్య వేదిక నాయకులు బుధవారం కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. నాయకులు బిడ్డిక ఉమామహేశ్వరరావు, వరహాల కృష్ణారావు, షణ్ముఖరావు, చొక్కారావు, నాగరాజు, రాకేష్, ఎం.జగ్గారావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-సీతంపేట

సహకార సభ్యులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి వాణి శైలజ కోరారు. బుధవారం వెలుగు కార్యాలయంలో సహకార సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యులు ఉంటేనే సహకార సంఘాలు ఉంటాయన్నారు. సహకార విద్య శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. దీనివల్ల వచ్చే లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు హెచ్.ప్రసాద్, రాజారావు, ప్రభు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ప్రతి ఒక్కరూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఆంగ్ల విభాగాల ఆధ్వర్యంలో వాల్మీకి రామాయణం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ కలాం రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. రక్షణ వ్యవస్థ ఆపరేషన్ సింధూర్‌కి ఎంతో దోహదపడుతుందని, సమాజ అభివృద్ధికి చేయాల్సిన కర్తవ్యం ఏమిటి? అంతర్జాతీయ సంబంధాలు గురించి పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. వాటి కోసం పత్రికలు నిరంతరం చదవాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేనని శ్రమను గుర్తించి గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రేఖ, ఐక్యూ ఎస్‌సి కోఆర్డినేటర్ డాక్టర్ జయపాల్ రావు, అకడమిక్ కో ఆర్డినేటర్ రూపవాణి తదితరులు పాల్గొన్నారు.

'అనుమతిస్తే తప్ప ధాన్యాన్ని తీసుకోను'

వేపాడ: తన మిల్లుకు అనుమతి ఇస్తే తప్ప ధాన్యాన్ని తీసుకోలేమని రామస్వామి పేట రైస్ మిల్లు యజమాని తహశీల్దార్ జె.రాములమ్మకు స్పష్టం చేశారు. ఈ మిల్లులో ధాన్యం తీసుకోవడం లేదని కొంత మంది తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆమె డిటి రామకృష్ణతో కలిసి బుధవారం రైస్ మిల్లును సందర్శించారు. ఈసందర్భంగా ధాన్యం తీసుకోకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తాను రూ.20లక్షలు బిజి కట్టానని అనుమతులు వచ్చిన వెంటనే ధాన్యం తీసుకుంటానని యజమానికి తహశీల్దార్‌కు చెప్పారు.

మండల స్థాయి విద్య వైజ్ఞానిక పోటీలు

నెల్లిమర్ల: రామతీర్థం జడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్య, వైజ్ఞానిక పోటీలు బుధవారం నిర్వహించారు. ఎంఇఒ యుఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 76 మంది విద్యార్థులు పాల్గొని సుమారు 40 ప్రదర్శనలు చేశారన్నారు. వీటి నుంచి ఏడు థీమ్‌లలో ఏడు ఉత్తమ ప్రదర్శనలు, సబ్జెక్ట్స్ నుంచి 2 ప్రదర్శనలు, ఉపాధ్యాయ విభాగం నుంచి రెండు ఉత్తమ ప్రదర్శనలు జిల్లాకు ఎంపిక చేస్తామన్నారు. ఉత్తమ ప్రదర్శనలు ఎంపిక చేయడానికి సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేణుగోపాలపురం డైట్ లెక్చరర్లు పాల్గొన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

చీపురుపల్లి: జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింట్ పోటీల్లో పట్టణంలో గల రామాంజనేయ కాలనీ వద్ద ఉన్న పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. మంగళవారం ఎల్‌కోటలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో పాఠశాలకు చెందిన పి.భాను, అండర్ 19 విభాగంలో వై.రాజులు గెలుపొందారు. కాగా వారు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్ సత్య శ్రీనివాసరావుని, విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం వివికె కృష్ణకుమారితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సర్వేలపై శిక్షణ

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాలపై సర్వేలు చేయాలని నివేదికలను సకాలంలో ప్రభుత్వానికి అందే విధంగా సచివాలయ సిబ్బంది చేపట్టవలసిన అంశాలపై సిబ్బందికి బుధవారం డిఎస్‌డబ్ల్యు జ్యోతి శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని, పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్, సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రవికుమార్ పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో పిఒ పల్లెనిద్ర

ప్రజాశక్తి-కురుపాం

పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి.. నీలకంఠాపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి నిద్ర చేశారు. మంగళవారం రాత్రి దాదాపు 8 గంటలకు పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రశ్నలను అడిగి, వారి విద్యా ప్రమాణాలను, స్వయంగా రుచి చూసి ఆహార నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ విద్యార్థుల ప్రమాణాలు పెరగడం, వారికి చక్కటి మార్గదర్శకం కల్పించడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగాలకు చక్కటి మార్గం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులకు ఉన్నత అవకాశాలు పట్ల అవగాహన అత్యావశ్యమని తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమం వల్ల వసతి సౌకర్యాలు మెరుగుదలతోపాటు విద్యార్థులకు తగిన ఆత్మవిశ్వాసం నింపడానికి ఉద్దేశించిందని చెప్పారు. మై స్కూల్, మై ప్రైడ్ కార్యక్రమం కింద జిల్లాలో మరోసారి పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉండుటకు కృషి చేస్తున్నామన్నారు.

అంతకుముందు అదే గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన వివిధ విభాగాలను తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను తిలకించి, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఫార్మసీని సందర్శించి అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. గడువు ముగిసిన మందులు ఉండకూడదని, నిల్వలపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో పిఒ నేరుగా మాట్లాడారు. డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా, ఉచితంగా మందులు అందుతున్నాయా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు అందుతున్న సేవల రిజిస్టర్లు, వ్యాక్సినేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వంద శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్యం విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు పిహెచ్‌సిలే ఆధారమని, వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో 24 గంటల పాటు సేవలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక వైద్యాధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిలో కేసు షీట్‌ను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్

విశ్రాంత ఉద్యోగులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

అఖిల భారత పింఛనుదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం కురుపాం విశ్రాంత భవనం ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్య అధికారి జీరు నగేష్‌రెడ్డి పర్యవేక్షణలో, పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో పెన్షనర్లకు కంటి పరీక్షలు చేశారు. కేటరాక్ట్, టేరిజియం వంటి కంటి వ్యాధులు ఉన్న వారిని గుర్తించి, ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ సూర్యకౌశిక్ తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాండురంగ, కార్యవర్గ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పెన్షనర్ పేదలకు ఇక నుండి నిరంతరంగా ఉచిత వైద్య సేవలు అందించేందుకు నిర్ణయించినట్లు ప్రజా వైద్యులు గుడివాడ ప్రభాకర్ రావు వెల్లడించారు. స్థానిక వర్తక సంఘం భవనంలో నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమంలో ఆయన ఉచిత వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గుడ్ల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రతో మాస్టర్, సీనియర్ ఉపాధ్యాయులు బేత కృష్ణమూర్తి, ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్ సతీష్, డాక్టర్ ప్రభాకర్, రిటైర్డ్ ఉద్యోగులు బండారు నీలకంఠం, ఢిల్లీ మాస్టర్, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ఎ.భాస్కరరావు, మాజీ సర్పంచ్ బండారు నీలకంఠం పాల్గొన్నారు.

పురుగు మందు కొంటేనే యూరియా..

◆ మన గ్రోమోర్ నిర్వాకం ◆ ఆవేదన చెందుతున్న రైతులు ◆ యూరియా అడిగితే గెటౌట్ అంటున్నారని మండిపాటు

ప్రజాశక్తి-చీపురుపల్లి

'పురుగు మందులు కొంటేనే యూరియా ఇస్తామంటున్నారు.. లేదంటే పొమ్మంటున్నారు.. యూరియా కోసం రోజులు తరబడి తిప్పుతున్నారు.. అవసరం లేని పురుగు మందులు తీసుకొని మేమేం చేస్తాం'.. అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లిలో మన గ్రోమోర్ వద్ద రైతులు పై విధంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణపు గౌరమ్మ, గవిడి రామకృష్ణ, నేదూరి చిట్టెమ్మ, వెంపడాపు నారాయణమ్మలతో పాటు మరి కొంత మంది రైతులు చీపురుపల్లిలో గల మన గ్రోమోర్‌కు యూరియా కోసం గత కొన్ని రోజులు క్రితం వ్యవసాయాధికారులు ఇచ్చిన రసీదులు పట్టుకొని బుధవారం వెల్లారు. అయితే అక్కడ ఉన్న సిబ్బంది యూరియా లేదు గీరియా లేదు పొండి అంటూ రైతులపై దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ యూరియా కావాలంటే పురుగు మందులు గానీ వేరొక వస్తువు గానీ తీసుకోవాలని కొర్రి పెడుతున్నారని రైతులు తెలిపారు. ఇటీవలే సుమారు ఆరు వేల రెండు వంద ఏభై రూపాయలు విలువ చేసే జొన్నలు కొన్నానని అప్పటిలో తనకు యూరియా వచ్చిన వెంటనే ఇస్తానని తనకు మన గ్రోమోర్ సిబ్బంది చెప్పారని తీరా యూరియా కోసం వస్తే పురుగులు మందులు కొంటేనే యూరియా ఇస్తామని గ్రోమోర్ సిబ్బంది చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కూడా ఇక్కడే జొన్నలు కొని పంట వేసానని యూరియా కోసం వస్తే గెటౌట్ అని రైతులమని చూడకుండా తమపై దురుసుగా సిబ్బంది దబాయిస్తున్నారని నేదూరి చిట్టెమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. జొన్న పంటకు వేసేందుకు రెండు యూరియా బస్తాలు కావాలంటే పురుగు మందులు తీసుకోవాలని నిబంధన పెట్టడం ఏమిటని గవిడి రామకృష్ణ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అవసరం లేకుండా పురుగులు మందులు కొనాలంటే తమకి ఆర్థిక భారం పెరుగుతుందని, అవసరం లేని పురుగుల మందు తాగి చావమంటారా అని కర్ణం గౌరమ్మ అనే మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై అధికారులు కలుగజేసుకొని తమకి యూరియా ఇప్పించాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయమై వ్యవసాయాదికారి సూర్యకుమారిని వివరణ కోరగా ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్నటు వంటి స్టాక్ సేల్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తామే రైతులకు దగ్గరుండి పంపిణీ చేస్తున్నామని చెప్పారు.


వ్యవసాయాధికారులు ఇచ్చిన రసీదు చూపిస్తున్న రైతులు

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో పెళ్లివలస గ్రామంలో బాల్య వివాహాల నిరోధంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాది కేతిరెడ్డి అశోక్ కుమార్, లోక్ అదాలత్ సభ్యులు జి.వెంకటరావు, పారాలీగల్ వాలంటీర్ అంధవరపు కోటేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాలు, విద్యకు ఆటంకం, కుటుంబ ఆర్థిక సామాజిక సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని నిరోధించేందుకు ప్రజలు చట్టాలను తెలుసుకుని బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే అధికారులకు లేదా న్యాయ సేవా సంస్థలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే జయకృష్ణ


ఎమ్మెల్యే జయకృష్ణకు వినతి అందిస్తున్న పెద్దూరు గిరిజనులు

ప్రజాశక్తి-వీరఘట్టం

విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు. బుధవారం వీరఘట్టంలో బాలుర హైస్కూల్, కెజిబివిలో ఆర్ఒ ప్లాంట్, పిఎంశ్రీ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉందని, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.జయశ్రీ, డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తి, ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఎంఇఒలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దూరు పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి

మండలంలోని పెద్దూరును ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని బుధవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఆ గ్రామ గిరిజనులు వినతిపత్రం అందజేశారు. పెద్దూరు, సింధునగర్, ఎస్.గోపాలపురం, అచ్చపువలస, గోపాలపురం గిరిజన గ్రామాలను ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఐదు గ్రామాలు మూడు పంచాయతీల్లో ఉన్నాయని, ఏ పంచాయతీకి వెళ్లినా ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని వాపోయారు. ఐదు గ్రామాల్లో కలిపి 900 మంది జనాభా, 750 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. సచివాలయంలో సంక్షేమ పథకాలు, ఇతర ధ్రువపత్రాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. వినతి అందజేసిన వారిలో నగేష్, బాలయ్య, ప్రశాంతి, ఎ.లక్ష్మి, ఆదినారాయణ, బి.సుందరరావు, తదితరులు ఉన్నారు.


మొండెంఖల్ గ్రామంలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న వై.మన్మథరావు

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు పిలుపునిచ్చారు. మహాసభ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలో మొండెంఖల్ గ్రామంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభ మొదటిసారిగా విశాఖపట్నంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై విస్తృత చర్చ జరిపి, భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తారని చెప్పారు. మహాసభ ముగింపు సందర్భంగా జనవరి నాలుగో తేదీన వేలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులంతా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు భారతి, బిడ్డిక సత్యవతి, బిడ్డిక సావిత్రి, బిడ్డిక కమల, పార్వతి, సాయి లక్ష్మి, కమల, కళావతి, తులసి, దమయంతి, చామంతి, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై కదిలిన యంత్రాంగం


ఆక్రమణకు గురైన చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కొమరాడ

దశాబ్ద కాలంగా ఆక్రమణకు గురైన చెరువును పరిశీలించేందుకు ఎట్టకేలకు అధికార యంత్రాంగం కదిలింది. కొమరాడ మండలంలో గుమడ రెవెన్యూ పరిధిలోని జగ్గునాయుడు చెరువు కబ్జాపై గ్రామానికి చెందిన కె.వాసునాయుడు పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఆ చెరువును తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. పదేళ్లకు పైగా కబ్జాకు గురైన చెరువుపై అనేకమార్లు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం చాలా దారుణమని చెరువు ఆయకట్టు రైతులు.. అధికారుల ముందు వాపోయారు. సుమారు 100 ఎకరాల ఆయకట్టు చెరువు ఆక్రమణకు గురికావడంతో పంట పొలాలకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కలెక్టర్‌కు నివేదిక అందజేసి చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు.

రైతులకు సబ్సిడీపై పరికరాలు

ప్రజాశక్తి-కొమరాడ

నిమ్మగడ్డి సాగు చేస్తున్న గిరిజన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయంతోపాటు వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ అందజేస్తుందని ఉద్యాన శాఖ అధికారి గిరిజ అన్నారు. బుధవారం మండలంలోని పూడేసు గ్రామంలో జన ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గిరిజ మాట్లాడుతూ నిమ్మగడ్డి పెంచుతున్న రైతులకు ఎకరాకు రూ.10 వేలు చొప్పున సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ పరికరాలు, బోర్లు, డ్రిప్ ఇరిగేషన్, తదితర వాటిని సబ్సిడీ ద్వారా వెనుకబడిన తరగతుల వారికి అందిస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు నిమ్మగడ్డి సాగుపై ఆసక్తి చూపడం చాలా సంతోషకరమన్నారు. నిమ్మగడ్డి సాగుతో గిరిజన రైతులు ఆర్థికంగా బలోపేతం చెందేందుకు అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో జన ప్రగతి ట్రస్ట్ వ్యవస్థాపకులు కర్రి ప్రసాద రావు మాట్లాడారు.



మాట్లాడుతున్న జనప్రగతి ట్రస్టు వ్యవస్థాపకులు ప్రసాదరావు

వరిచేను పరిశీలన

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని చెరకుపల్లి గ్రామంలో రైతు ఎం.భాస్కరరావు ఆర్‌జిఎల్ 7030 రకాన్ని సాగు చేశారు. చిరు సంచులలో ఇచ్చిన కొత్త ఆర్‌జిఎల్ 7030 రకాన్ని బుధవారం మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు పరిశీలించారు. ఈ రకం కాండం దృఢంగా ఉందని, గాలికి పడిపోదని ఎఒ చెప్పారు. గింజలు సాధారణ ఆర్‌జిఎల్-2037 రకంతో పోలిస్తే దగ్గరగా, దృఢంగా ఉన్నాయని తెలిపారు. గడ్డి ఎక్కువ రోజులు పచ్చగా ఉండటం వల్ల పశువుల మేతకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దిగుబడి 5 నుండి 10 శాతం ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. వారం రోజులు ఆలస్యంగా కోతకు వస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య పాల్గొన్నారు.


వరిచేనును పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

శత్రుచర్లను కలిసిన డొంకాడ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజును విశాఖలోని తన నివాసంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శత్రుచర్లను తన గురువుగా భావించే డొంకాడ ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జియ్యమ్మవలస మండల కన్వీనర్ జోగి భుజంగరావు, సీనియర్ నాయకులు పొట్నూరు వెంకటనాయుడు, లంక గోపాలం, దాసర రామారావు నాయుడు, కోలా రంజిత్‌కుమార్, శివ్వాల తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి శత్రుచర్లను సన్మానిస్తున్న డొంకాడ రామకృష్ణ